సాక్షి
నిర్మల్
శనివారం । 8 । ఏప్రిల్ । 2023



ప్రభుత్వ బడులకు ట్యాబ్‌లు
సర్కారు బడుల్లు కార్పొరేట్‌కు దీటుగా కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఇందులో భాగంగానే పాఠశాలలకు ట్యాబ్‌లు అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. 10లో▸



గుట్టను తోడేస్తున్నారు
లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌–మూటాపూర్ సమీపంలోని గుట్టను అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /23.1

వాతావరణం
ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. గాలిలో తేమశాతం పెరుగుతుంది. సాయంత్రం అక్కడక్కడా వడగండ్లు కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్		సహర్
శని :	6:29	ఆది :	4:47

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌ను గద్దె దించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పెంబి: ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీజేపీ ఓబీసీమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సగౌడ్ కోరారు. పల్లెపల్లెకూ ఓబీసీ, ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని వారసంతలో శుక్రవారం తిరుగుతూ ఓబీసీమోర్చా కరపత్రాలు పంపిణీ చేశారు. వారసంతలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దెదింపే వరకు ప్రతీ కార్యకర్త పోరాడాలన్నారు. రాబోయో ఎన్నికల్లో బీజేపీని గెలిపించి డబుల్ ఇంజన్ సర్కార్‌ను తెచ్చుకోవాని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జానుబాయి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు సదాశివ్, నాయకులు రాజు, రాజన్న, పవన్, మల్లేశ్, మల్లు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనంలో ఎమ్మెల్యే, నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీజేపీ నాయకులు ప్రభుత్వంపై బురద చల్లేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పుప్పాల శంకర్, అంకం రాజేందర్, వెంకాగౌడ్, గొర్రె గంగాధర్, కిశోర్, శంకర్, కలీల్, గజేందర్, రాజేశ్వర్, కేహెచ్. ఖాన్, సర్దిల్, భీమేశ్వర్ తదితరులు ఉన్నారు.

మాసాయిపేట్‌లో ఇఫ్తార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో పురాతన దర్గా కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రేఖానాయక్ హాజరయ్యారు. ముస్లింలతోపాటు, హిందువులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం మతసామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే అన్నారు. మతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రఫీక్ అహ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఖలీల్, ముస్లిం మత పెద్దలు షాహిద్ మౌలానా, సర్పంచ్ రాము గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మార్గం



రోడ్డుకిరువైపులా మొరం వేసిన దృశ్యం

- ప్రారంభమైన 161బీబీ హైవే పనులు
- ఇరువైపులా విస్తరణ
- అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణం
- భైంసా–బాసర వరకు కొనసాగుతున్న పనులు
- మహోర్ వరకు నిర్మించాలంటున్న ప్రజలు



రోడ్డును మళ్లించిన దృశ్యం



భైంసా సమీపంలో కల్వర్టు నిర్మాణం

భైంసా: పల్లెలు, పట్టణాల అభివృద్ధిలో రహదారులు కీలకపాత్ర పోషిస్తాయి. రవాణా సౌకర్యం మెరుగ్గా ఉంటే.. మారుమూల పల్లెలు సైతం అభివృద్ధి చెందతాయి. ఈ క్రమంలో కేంద్రం జాతీయ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని భైంసా – బాసర మధ్య 161బీబీ హైవే విస్తరణ చేపట్టింది. ఈమేరకు ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి. భైంసా నుంచి బాసర వరకు రోడ్డుకిరువైపులా విస్తరణ పనులు మొదలు పెట్టారు. అవసరమైన చోట కల్వర్టులు నిర్మిస్తున్నారు. కల్వర్టులు నిర్మించే ప్రాంతాల్లో దారి మళ్లించి పనులు చేస్తున్నారు. భైంసా–బాసర హైవే పనులు జోరందుకోవడంతో ఈ మార్గంలోని పల్లెలు, పట్టణాల రూపురేఖలు మారబోతున్నాయి. దీంతో మార్గాన్ని మహారాష్ట్రలోని మహోర్ వరకు కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. ఈమేరకు గతంలోనే ఈ ప్రాంతానికి చెందిన వైద్యులంతా కలిసి ఎంపీ సోయం బాపురావుకు వినతిపత్రం ఇచ్చారు. బాసర నుంచి 164 కి.మీ దూరంలో ఉన్న మహోర్ వరకు హైవే నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు. బాసర సరస్వతి అమ్మవారి ఆలయం నుంచి మహారాష్ట్రలోని మహోర్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయం వరకు ఆధ్యాత్మిక కారిడార్ నిర్మించాలన్న డిమాండ్ పెరుగుతోంది.

పనులకు మోక్షం..
ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న హైవే పనులకు మోక్షం లభించింది. బోధన్ – భైంసా హైవే నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. మద్నూర్ నుంచి బోధన్, భైంసా వరకు జాతీయ రహదారి నిర్మించాలని సర్వే పూర్తిచేశారు. హైవే 161 బీబీ పనులు ప్రారంభమయ్యాయి. బోధన్ నుంచి భైంసా వరకు 56.4 కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం రూ.650 కోట్లు ప్రతిపాదించారు. హైదరాబాద్‌కు చెందిన అనూష కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఈ పనులు చేపడుతోంది. మొదటి విడతలో భాగంగా బోధన్, బాసర, భైంసా వరకు 56.4 కిలోమీటర్ల మేర రోడ్డు కోసం కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

గోదావరిపై మరో వంతెన..
నిజామాబాద్ జిల్లా బోధన్ శివారులోని బాబా గార్డెన్ వద్ద మొదలయ్యే రోడ్డు నిర్మాణం పనులు భైంసా వరకు కొనసాగనున్నాయి. బోధన్ బాబా గార్డెన్ నుంచి ఆచన్‌పల్లి బైపాస్ పెగడపల్లి బైపాస్, సాటాపూర్, తాడ్ బిలోలి, బోరిగాంను కలిపి ఒక బైపాస్ రానుంది. బోధన్ నుంచి ఫకీరాబాద్ వరకు ఆరు బైపాస్‌లు నిర్మించనున్నారు. ఫకీరాబాద్‌లో రైల్వేస్టేషన్ ఉండడంతో అక్కడ ఆర్‌ఓబీ నిర్మించనున్నారు. అక్కడి నుంచి పాత రోడ్డు మీదుగా యంచ వద్ద గోదావరి నదిని కలుపుతూ మరో వంతెన నిర్మించనున్నారు. యంచ గ్రామం నుంచి గోదావరిని కలుపుతూ కొత్త వంతెన కోసం భూమి సేకరించారు. కొత్త వంతెన నిర్మించే స్థలాన్ని ఇంకా ప్రకటించలేదు.

పాత రోడ్డుమీదుగానే..
కొత్త హైవే నిర్మాణంలో భాగంగా బాసర నుంచి భైంసా వరకు ఉన్న పాత రోడ్డునే విస్తరిస్తున్నారు. నూతనంగా బాసర వద్ద గోదావరి నదిపై నిర్మించే వంతెన గుండా బాసర రైల్వేస్టేషన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేపట్టనున్నారు. 161బీబీ రోడ్డు 10 మీటర్ల వెడల్పుతో రెండు వరుసలుగా నిర్మిస్తున్నారు. ఇరువైపులా బీటీ షోల్డర్స్‌ను నిర్మిస్తున్నారు. బోధన్ నుంచి భైంసా వరకు మూడు కూడళ్ల ఆరు చోట్ల బైపాస్‌లు, గోదావరి నదిపై వంతెన నిర్మించనున్నారు.

161బీబీ హైవే వివరాలు..

బోధన్ నుంచి భైంసా వరకు : 56.4 కి.మీలు
అంచనా వ్యయం : రూ.650 కోట్లు
నిర్మాణ సంస్థ : అనూష కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ, హైదరాబాద్
ప్రధాన పట్టణాలు : బోధన్, బాసర, భైంసా

తీరనున్న ఇబ్బందులు..
బోధన్ – భైంసా జాతీయ రహదారి 161బీబీ నిర్మాణంతో ప్రయాణికుల ఇక్కట్లు తీరనున్నాయి. ఈ కొత్త రోడ్డు బాసరను కలుపుతూ నిర్మించనున్నారు. బాసర ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో ఇక్కడ లక్షలాది యాత్రీకులు వస్తున్నారు. తెలంగాణలోనే ఏకైక ట్రిపుల్‌ఐటీ బాసరలో ఉంది. ఈ ట్రిపుల్‌ఐటీలో 8 వేల మంది విద్యార్థులు మరో 2 వేల మంది ఇతర సిబ్బంది ఉంటారు. చదువుల క్షేత్రం కావడంతో ప్రతీరోజు ఇక్కడికి వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇక నిర్మల్ జిల్లాలో బాసరలోనే ఏకైక రైల్వేస్టేషన్ ఉంది. జిల్లావాసులు దేశవ్యాప్తంగా రైలు ప్రయాణం చేయాలన్నా బాసరకే వస్తుంటారు. ఇలా బాసరకు జనం తాకిడి ఎక్కువగానే ఉంటుంది. అమ్మవారిని దర్శించుకునే యాత్రికులు, ట్రిపుల్‌ఐటీకి వచ్చే విద్యార్థులు, రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులతో ఈ రహదారి ఎప్పుడు రద్దీగానే ఉంటుంది. కొత్త రోడ్డు నిర్మాణంతో ఇక్కట్లు తీరనున్నాయి. మరోవైపు బాసర, భైంసాతోపాటు, ఈ జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల రూపురేఖలు మారిపోనున్నాయి. ఇక్కడి భూముల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది.

పనులు పర్యవేక్షిస్తున్నాం..
భైంసా నుంచి బాసర వరకు హైవే పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను ప్రతీరోజు పర్యవేక్షిస్తున్నాం. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో కల్వర్టులు నిర్మించనున్నాం. ఈ ప్రాంతాల్లో రోడ్డును మళ్లించి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.
– సుభాష్, డీఈఈ, నిర్మల్


కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న రేఖానాయక్

ఖానాపూర్: సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలోని తర్లపాడ్‌లో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఖానాపూర్ మండల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో కేసీఆర్ పాలనకు ముందు ఏ గ్రామాల్లో చూసినా సమస్యలే ఉండేవన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాయని తెలిపారు. పార్టీ కార్యకర్తల కృషిని మరువలేమని పేర్కొన్నారు. ఎనిమిదేళ్ల పాలనలో ఏమైనా తప్పులు ఉంటే మన్నించాలన్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని తెలిపారు. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. పుట్టి న బిడ్డ నుంచి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం వివిధ పథకాల రూపంలో లబ్ధి చేకూరుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుప్పాల శంకర్, అంకం రాజేందర్, రాజగంగన్న, తూము చరణ్, పార్శపు శ్రీనివాస్, వాల్‌సింగ్, వెంకాగౌడ్, ప్రదీప్, సతీష్, శ్రీనివాస్, రాజేశ్వర్, కేహెచ్.ఖాన్, గంగాధర్, శ్రావణ్, గజెందర్, రాజిరెడ్డి, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు గౌడ సంఘం సన్మానం



భైంసాటౌన్: ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్‌ను ముథోల్ తాలూకా గౌడ సంఘం నేతలు శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు. భైంసా ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితోపాటు ఎమ్మెల్సీని శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మురళీగౌడ్, హనుమాన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అశోక్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ తదితరులు

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్‌టౌన్: తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మివాడలో బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని 10 వార్డులకు సంబంధించిన ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. అంతకుముందు మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సమావేశం ప్రారంభం కాగానే 10వ వార్డుల కౌన్సిలర్ కాలనీల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను ఆదుకునేలా పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. 75 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ అభివృద్ధి చెందలేదని తెలిపారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో 9 ఏళ్లలోనే ఊహించనంతగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, గీత, చేనేత కార్మికులకు పింఛన్లు, రజక, నాయీబ్రాహ్మణ దుకాణాలకు ఉచిత విద్యుత్, విద్యార్థులకు సన్న బియ్యం, కేసీఆర్ కిట్, ఆరోగ్యలక్ష్మి ఇలా ఎన్నో పథకాలు ప్రజలకు అందుతున్నాయని వివరించారు. వృత్తుల వారీగా కూడా ఆర్థిక భరోసా కల్పించేందుకు గొర్రెలు, చేప పిల్లల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా నిర్మల్ నియోజకవర్గంలోని 213 గ్రామాలకు ఇంటింటికీ రూ.300 కోట్ల వ్యయంతో శుద్ధమైన తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని ప్రమాదవశాత్తు మృతి చెందిన 943 మంది రైతు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.47.15 కోట్ల బీమా అందించామని వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన సత్వర సేవలు ఒకే దగ్గర అందాలనే ఉద్దేశంతో జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనాన్ని రూ.56 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. సుమారు రూ.48.83 కోట్ల వ్యయంతో 250 పడకల జిల్లా ఆస్పత్రి భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. 100 ఎంబీబీఎస్ సీట్లతో రూ.166 కోట్ల వ్యయంతో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు చేపట్టామని పేర్కొన్నారు. త్వరలో ఈ భవనాల ప్రారంభోత్సవానికి సీఎం కేసీఆర్ జిల్లాకు వస్తారని తెలిపారు.

బదనాం చేయాలని బీజేపీ కుట్ర..
తెలంగాణ ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను బదనాం చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని మంత్రి ఆరోపించారు. ఈ క్రమంలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో బీజేపీ పాత్ర ఉందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో నరేంద్రమోదీకి, బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. బీజేపీని ఢీకొట్టే ఏకైక నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారు గొండ రాము, ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, యువ నాయకులు అల్లోల దివ్య –గౌతమ్‌రెడ్డి, దేవేందర్ యాదవ్, అల్లోల సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక రమణ, కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మన్నించు రాంజీ..!



చైన్‌గేట్ వద్ద రాంజీగోండ్, కుమురంభీం విగ్రహాలు



నిర్మల్–ఎల్లపెల్లి దారిలోని అమరవీరుల స్థూపం

- వెయ్యి మంది ప్రాణత్యాగాలకు గుర్తింపేది..
- ఉరులమర్రి ఘటనకు పుస్తకాల్లో చోటేది..
- మందుబాబులకు అడ్డాగా స్మారక స్థలాలు
- హామీలుగానే అమరధామం, మ్యూజియం
- రేపు రాంజీగోండు వర్ధంతి సందర్భంగా..

నిర్మల్: వాళ్లెవరో ఇప్పటికీ చాలామందికి తెలియదు. ఈ తరానికి కనీసం వాళ్ల పేర్లు, చేసిన పోరూ కూడా తెలియదు. ఎండకు ఎండుతూ.. వానకు నానుతూ.. కాలగర్భంలో కలిసిపోతున్న తమ చరిత్ర లాగే రంగులు వెలిసిపోతున్నా మౌనంగా నిల్చున్నారు. ఎప్పటికైనా.. ఎవరైనా తమని చూడకపోతారా.. త్యాగాలను గుర్తించకపోతారా.. అన్న ఆశతో ఎదురుచూస్తున్నట్లుగా ఉంటారు. వారెవరో తెలియాలంటే.. నిర్మల్‌లోని చైన్‌గేట్ కార్నర్ వద్దకు వెళ్తే విగ్రహాల రూపంలో కనిపిస్తారు. వాళ్ల చరిత్ర గురించి తెలుసుకోవాలంటే ఊరి బయట ఎల్లపెల్లి తోవలోని స్థూపం దగ్గరికి పోతే వినిపిస్తుంది. ఈనెల 9న రాంజీ గోండ్ సహా వెయ్యిమంది వీరుల వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆయనే రాంజీ..
నిర్మల్ చైన్‌గేట్ దగ్గర ఉన్న విగ్రహాల్లో తుపాకీ చేత పట్టిన యోధుడు కుమ్రంభీముడైతే.. విల్లంబు పట్టుకున్న మరో వీరుడే మన రాంజీ.. రాంజీగోండు. అడవిలోకి చొచ్చుకువస్తూ, అమాయకులైన ఆదివాసీలను అవస్థలు పెడుతున్న శత్రువులను అణచివేసేందుకు జనగామ(ప్రస్తుత ఆసిఫాబాద్) నుంచి నిర్మల్‌కు వచ్చాడు. ఇక్కడి ఆంగ్లేయ కలెక్టర్‌పై యుద్ధం చేశాడు. ప్రథమ భారత సంగ్రామ ముగింపు సమయంలో ఇటువైపుగా వచ్చి రోహిలాల్లు, తన గిరివీరులతో కలిసి ఆంగ్లేయ, నైజాం సైన్యాలతో భీకరంగా పోరాడాడు. చివరకు దొంగదెబ్బతో శత్రువు చేతికి చిక్కాడు. అలా 1860 ఏప్రిల్ 9న నిర్మల్–ఎల్లపెల్లి దారిలోని ఒకే మర్రిచెట్టుకు రాంజీ సహా వెయ్యి మంది వీరులను ఉరితీశారు. ఇలా స్వాతంత్య్ర పోరాటంలో ఒకే చెట్టుకు ఒకేసారి వెయ్యిమందిని ఉరితీసిన ఘటన దేశ చరిత్రలో ఎక్కడా లేదు. చరిత్ర ఇప్పటికీ చెప్పుకునే జలియన్‌వాలాబాగ్ మారణకాండకు ముందే ఈ ఘటన జరిగినా.. చరిత్రలో ఎక్కడా వెయ్యి ఉరుల మర్రి ఘటనకు చోటివ్వలేదు. పాఠ్యపుస్తకాల్లోనూ ఒక్క అక్షరం కూడా రాంజీ గురించి రాయలేదు.

మందుబాబులకు అడ్డాగా..
జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్ దగ్గర రాంజీ బొమ్మను కూడా తెలంగాణ ఉద్యమకాలంలో పలువురు ఉద్యమకారులు ఏర్పాటు చేశారు. మర్రిచెట్టు ప్రాంతంలో స్థూపం నిర్మించారు. పాలకులు, అధికారులు పట్టించుకోకున్నా.. కనీసం ముందుతరాలు వీరుల త్యాగాలను గుర్తించాలన్న ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు. కానీ.. వీరుల విగ్రహాలు, స్థూపం ఇ ప్పుడు మందుబాబులకు అడ్డాగా మారింది. విగ్రహాల చుట్టూ తోపుడుబండ్లు పెట్టారు. సాయంత్రం విగ్రహాల దిమ్మె మీద కూర్చొనే మందు కొడుతున్నారు.

అమరధామం అడ్రసేది..
మ్యూజియం ఎక్కడ?
ఆదివాసీ వీరుల పోరును, త్యాగాలను ముందుతరాలకు అందించేలా ఇక్కడ అమరధామం, మ్యూజియం ఏర్పాటు చేస్తామని నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రాంజీ గోండు పేరిట మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు. రెండేళ్ల క్రితం కేంద్రం హోం మంత్రి అమిత్‌షా సైతం నిర్మల్‌కు వచ్చి నివాళులర్పించారు. కానీ అమరధామం, మ్యూజియం ఏర్పాటుకు అడుగు కూడా ముందుకు పడలేదు. రాష్ట్ర ప్రభుత్వం అయితే అమరవీరుల త్యాగాలను ఇప్పటికీ గుర్తించడం లేదు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులూ గుర్తించే ప్రయత్నం చేయకపోవడం బాధాకరం. కుమ్రంభీముడి పోరుకు స్ఫూర్తినిచ్చిన రాంజీ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని ఆదివాసులు, పలు సంఘాలు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం అటుంచి, వర్ధంతి రోజూ నివాళులర్పించడానికి కూడా రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మరి ఈ వర్ధంతికైనా వీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి, చరిత్రలో కాసింత చోటివ్వాలని జిల్లావాసులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



క్రీస్తు సందేశం వినిపిస్తున్న పాస్టర్.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రం గాజులపేట్ సీఎస్ఐ చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం క్రైస్తవులు సామూహికంగా భక్తిగీతాలు ఆలపించారు.



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయండి

- ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి

కుభీర్: మండలంలోని మాలేగాం గ్రామంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు సూచించారు. దేశంలో ఎక్కడా ఇలాంటి పథకాలు లేవన్నారు. అందుకే మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ కావాలని కోరుతున్నారన్నారు. మాలేగాం గ్రామస్తులు అడిగినట్లు గడ్డెన్న వాగుపై లిఫ్ట్ ఏర్పాటుకు సర్వే చేయించామని తెలిపారు. ఆ ప్రాజెక్ట్ ద్వారా 250 గ్రామాలకు తాగునీరు అందుతున్నందున లిఫ్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం వెనుకాడుతోందని వివరించారు. మాలేగాంను మండలం చేయడానికి ఏడు ఎంపీటీసీలు, జనాభా ఎక్కువ కావాలని తెలిపారు. అంత జనాభా లేకున్నా సీఎం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

పుట్టుక నుంచి చనిపోయే వరకు పథకాలు..
బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా మనిషి పుట్టుక నుంచి చనిపోయే వరకు ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టిందని ఆత్మీయ సమ్మేళనాల జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ అన్నారు. పుట్టినప్పుడు కేసీఆర్ కిట్ అందులో తల్లి, బిడ్డకు అవసరమైన 14 రకాల వస్తువులు ఇస్తున్నారని చెప్పారు. పిల్లల చదువుకు గురుకులాలు, యుక్త వయసులో పెళ్లికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతులకు రైతుబంధు, చనిపోతే రైతుబీమా ఇలా చక్కటి పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. మరో ఆరు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయ ని, కార్యకర్తలు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మండల అధ్యక్షుడు అనిల్, పీఏసీఎస్ చైర్మన్ గంగచరణ్, బాసర జెడ్పీటీసీ వసంతరమేశ్, మాజీ జెడ్పీటీసీ చవాన్.శంకర్, సర్పంచ్ మహిపాల్ రెడ్డి, ఎంపీటీసీ కృష్ణకళాగంగారావ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న బండరాయి ఎత్తే పోటీలు

కుంటాల: మహాదేవుని పౌర్ణమి, హనుమాన్ జయంతి పురస్కరించుకుని మహాదేవుని ఆలయ ఆవరణలో గురువారం రాత్రి వెయిట్ లిఫ్టింగ్ పోటీల మాదిరిగానే బండరాయి ఎత్తే పోటీలు నిర్వహించారు. సుమారు120 కేజీల బండరాయిని ఎల్లమ్మల గజేందర్, ఎడ్ల గజేందర్, కొత్త కాపు పండరి, 60 కేజీల బండరాయిని కరెంటు శ్రీనుతో పాటు యువకులు ఎత్తి తమ సత్తా చాటారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. మహాదేవుని జెండాలను గురువారం రాత్రి భాజాభజంత్రీలతో గ్రామంలో ప్రధాన వీధుల గుండా తీసుకెళ్లారు. మహదేవుని ఆలయం వద్ద పూజలు నిర్వహించి మొక్కులు తీసుకున్నారు.

వివాహిత అదృశ్యం


అనూష(ఫైల్)

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి గ్రామంలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్న వివాహిత అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి వివరాల ప్రకారం ...మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా ఈరేగాం గ్రామానికి చెందిన రాంకిషన్‌కు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరంతా బీరవెల్లి గ్రామంలోని ఓ వ్యక్తి వద్ద ఇటుకబట్టీలో కూలీలుగా పనిచేస్తున్నారు. ఇందులో మూడో కుమార్తె ఉర్దాకే అనూష (20) భర్త ఉర్దాకే మారుతితో కలిసి ఇక్కడే పనిచేస్తుంది. ఈ క్రమంలో అనూష ఈ నెల 4న బహిర్భూమికి వెళ్లి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి అంతా గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య


నిమ్మ నరేష్(ఫైల్)

లోకేశ్వరం: చెరువులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని పుస్పూర్‌కు చెందిన నరేశ్ (23) ఎలాంటి పని చేయకుండా తిరుగుతున్నాడు. గురువారం రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఆచూకి లభించలేదు. శుక్రవారం ఉదయం నరేష్ చెప్పులు గ్రామ సమీపంలోని బొప్పాజీ చెరువు వద్ద కనిపించడంతో పోలీసులు చేరుకుని చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభించింది. తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేణుకా మాతా ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలోని రేణుకామాతా ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. రేణుకామాతా అమ్మవారిపై ఉన్న రూ.2లక్షల విలువ చేసే వెండీ ఆభరణాలు, హుండీలోని రూ.30వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నాందేడ్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ బడులకు ట్యాబ్‌లు

- త్వరలో పంపిణీ చేయనున్నట్లు అధికారులు
- ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ
- మౌలిక వసతుల మెరుగుకు చర్యలు

జిల్లాల వారీగా ట్యాబ్‌ల పంపిణీ ఇలా..

ఆదిలాబాద్	565
మంచిర్యాల	533
కుమురంభీం	586
నిర్మల్	553


ఆదిలాబాద్ జిల్లాకు చేరిన ట్యాబ్‌లు

నిర్మల్‌రూరల్: పాఠశాల విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కరోనా తదితర కారణాలతో ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థులకు కనీస సామర్థ్యాలు సాధించలేకపోయారని గుర్తించి ప్రభుత్వం ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం కింద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. సర్కారు బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందించేందుకు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. నిర్మల్ జిల్లా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల 618 ఉండగా ఇప్పటికే 553 ట్యాబ్‌లు జిల్లాకు చేరుకున్నాయి. త్వరలో ఎంపిక చేసిన బడులకు వీటిని అందిందించనున్నారు. తొలివిడతలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 19,800 పాఠశాలలకు అందజేయనున్నారు.

జిల్లాకు చేరిన 553 ట్యాబ్‌లు..

ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 553 ట్యాబ్‌లను కేటాయించింది. జిల్లాలో ఇప్పటికే మన ఊరు– మనబడి, మన బస్తీ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయి. 2023– 24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు సరికొత్త యూనిఫామ్ కోసం ప్రభుత్వం ఇప్పటికే వస్త్రాన్ని అందజేసింది. ప్రస్తుతం బడుల సమగ్ర సమాచారాన్ని ప్రతిరోజు ఉపాధ్యాయులు సెల్ ఫోన్‌తో యుడైస్ ప్లస్ లో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉపాధ్యాయులు రిక్వెస్ట్ చేయడంతో ట్యాబ్‌లను సరఫరా చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మంచిర్యాల జిల్లాలో...

మంచిర్యాల జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 433, ప్రాథమికోన్నత 95 ఉన్నాయి. మొత్తం 528 పాఠశాలలకు 533 ట్యాబ్‌లు జిల్లాకు చేరాయి.

ఆసిఫాబాద్ జిల్లాలో..

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 535, ప్రాథమికొన్నత పాఠశాలలు 98 ఉండగా 571 పాఠశాలలు మాత్రమే 586 ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు.

ఏం చేస్తారు...

జిల్లాలో కొన్ని ప్రాథమిక, ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి వివరాలు, అదేవిధంగా విద్యార్థికి ఆయా పరీక్షల్లో వచ్చిన మార్కులు, పాఠ్యాంశ ప్రణాళిక అమలులో విద్యార్థి ప్రతిభ, విద్యార్థి అడ్మిషన్ సంఖ్య, మధ్యాహ్న భోజనం, అభ్యసన సామర్థ్యం, మన ఊరు– మన బడి, మన బస్తీ, పాఠశాల వదిలి వెళ్లిన తేదీ తదితర విషయాలన్నీ ఇందులో నిక్షిప్తం చేయనున్నారు. జిల్లాలో మొత్తం 735 ప్రభుత్వ జిల్లాలో 150 కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలకు రెండేసి ట్యాబ్‌లను అందజేస్తారు.

ఆదిలాబాద్ జిల్లాకు..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని పభుత్వ ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు వీలుగా ప్రభుత్వం ట్యాబ్‌లను మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం సామ్‌సాంగ్ కంపెనీకి చెందిన 565ట్యాబ్‌లు జిల్లాకు చేరారు. జిల్లాలో 436 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలుండగా 450 ట్యాబ్‌లు, 105 ప్రాథమికొన్నత పాఠశాలలకు 115 ట్యాబ్‌లను మంజూరు చేశారు. పది నుంచి 165 మంది విద్యార్థులకు ఒక ట్యాబ్‌ను అందించనుండగా అంతకు మించి విద్యార్థుల సంఖ్య కలిగిన పాఠశాలలకు రెండు చొప్పున ట్యాబ్‌లు అందించనున్నారు. మొత్తం 541 పాఠశాలకు 565 ట్యాబ్‌లను పంపించారు. ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన వివరాలు, సమస్త సమాచారాన్ని ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. ఉపాధ్యాయులకు శిక్షణనందించి అనంతరం వారికి ట్యాబ్‌లను అందజేస్తామని డీఈఓ టి.ప్రణీత తెలిపారు.

త్వరలో అందజేస్తాం



జిల్లాకు 553 ట్యాబ్‌లు వచ్చాయి. వీటిని డీఈవో కార్యాలయంలో భద్రపరిచాం. త్వరలోనే ఉపాధ్యాయులకు అందజేస్తాం. పాఠశాలకు సంబంధించిన రిపోర్టులు సెల్‌ఫోన్‌లో పంపించే క్రమంలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం వీటిని సరఫరా చేస్తోంది. – రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

దైవదర్శనానికి వెళ్లి వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి
- మరో ఐదుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు


సిందే ఆదిత్య(ఫైల్)

భైంసాటౌన్: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా కాసేపట్లో ఇంటికి చేరుతామనుకునేలోగా లారీ ఢీకొన్న ఘటనలో బాలుడు మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్రగాయాలపాలైన ఘటన భైంసాలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. భైంసాలోని పిప్రి కాలనీకి చెందిన సింధే ఆదిత్య(7) తన నానమ్మ కళావతితో కలిసి ఆదిలాబాద్ నుంచి కారులో వచ్చిన అత్త, మామలు, వారి పిల్లలతో కలిసి భైంసా నుంచి షిర్డీకి బయలుదేరారు. తిరిగి వస్తున్న క్రమంలో శుక్రవారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో భైంసాలోని నాగదేవత గుడి సమీపంలో భైంసా నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న లారీ, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో సింధే ఆదిత్య, కళావతిలు తీవ్రంగా గాయపడగా, డ్రైవర్ కార్తీక్, బాలుడి అత్త రోహిణి, మామ రఘువీర్, వీరి కుమారుడు శ్రేయంక్ గాయాలపాలయ్యారు. సమాచారమందుకున్న 108 సిబ్బంది వెంటనే భైంసాలోని ఏరియాస్పత్రికి తరలించారు. బాలుడు ఆదిత్యను నిర్మల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కళావతిని మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. ఈ మేరకు పట్టణ సీఐ ఎల్ శ్రీను సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

సొంత నిధులతో తాత్కాలిక వంతెన


పనులు పరిశీలిస్తున్న పాయల్ శంకర్

జైనథ్: మండలంలోని తరోడ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కుంగిపోయిన వంతెన కింది నుంచి సొంత నిధులతో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన తరోడు చేరుకుని ఇంతకు ముందు నిర్మించిన తాత్కాలిక వంతెనను పరిశీలించారు. ఈ వంతెన ఇరుకుగా ఉండటంతో ప్రమాదకరంగా మారిందని, ఇటీవలే ఓ అంబులెన్స్ వాగులో పడిపోయిందని ఆయన తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అధికారులు నిర్మించిన తాత్కాలిక వంతెన పక్కనే మరో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇరుకుగా ఉన్న రోడ్డుకు ఇరువైపులా జేసీబీతో చదును చేయించి తాత్కాలిక వంతెన పనులు ప్రారంభించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రూ.2కోట్లతో తాత్కాలికంగా సీసీ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, ఇతర నాయకులు ఉన్నారు.

దేశీదారు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


పట్టుబడిన నిందితుడితో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

జైనథ్: మండలంలోని సాంగ్వి గ్రామంలోని సంతలో దేశీదారు విక్రయిస్తున్న అదే గ్రామానికి చెందిన అనిల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ లక్ష్మణ్‌రావ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... శుక్రవారం సాంగ్వి గ్రామంలో దేశీదారు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి సంతకు చేరుకున్నారు. సంతలో అనుమానాస్పదంగా కనిపించిన అనిల్‌ను తనిఖీ చేయగా 40 దేశీదారు సీసాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సైజ్ సీఐ తెలిపారు. సిబ్బంది రవీందర్, మోహన్ పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుల రిమాండ్

పెంబి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన గిరిజన బాలికపై అత్యాచారానికి పాల్పడిన నలుగురు యువకులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందితులపై అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా నిర్మల్ సబ్ జైల్‌కు రిమాండ్‌కు తలరించినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఉట్నూర్ ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఉట్నూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మండలంలోని శ్యాంపూర్ గ్రామ సమీపాన మధ్యప్రదేశ్‌కు చెందిన శివరాం(52) ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా, మృతుడు మధ్యప్రదేశ్ నుంచి వారం రోజుల క్రితమే ఇక్కడికి కూలీ పనుల నిమిత్తం వచ్చాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో కూలీగా భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనం బోల్తాపడి ఒకరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బాబాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం బొలేరో వాహనం బోల్తా పడి మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఆళ్లపల్లికి చెందిన అరుణ్ ఆనంద్‌రావు(23) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రలోని ఆళ్లపల్లికి బెల్లం లోడుతో వెళ్తుండగా బాబాపూర్ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. బొలేరోలో అరుణ్ ఆనంద్‌రావుతోపాటు సహదేవ్ జగదేవ్, నగేశ్ సెడ్మెకె, గణేష్ సుఖ్‌దేవ్ ఆత్రం, సూరజ్ నాందేవ్ సిడాం ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో అరుణ్ ఆనంద్‌రావు అక్కడికక్కడే మృతిచెందగా, సహదేవ్ జగదేవ్, గణేష్ సుఖ్‌దేవ్‌లకు గాయాలయ్యాయి. వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ప్రణయ్ దిలీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ప్రముఖ సంఘ సంస్కర్త, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మా జ్యోతిబా పూలే 196వ జయంతిని ఈ నెల 11న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు సభ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, జిల్లా ప్రధాన కార్యదర్శి వాడగురే ఉత్తం, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఉమేష్‌రావు డోలే, జిల్లా అధ్యక్షుడు ధనుంజయ ప్రధాన్, ఉద్యోగ సంఘ నేతలు ప్రధాన్ భాస్కర్, అనిల్ కోట్ రంగే, రాంకిషన్ శేండే, గజానంద్ టాకిరే, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


తేజ (ఫైల్)

తలమడుగు: యువకుడు రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని కోడథ్ గ్రామానికి చెందిన కొల్లూరి తేజ (22) ఏ పనిచేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపానికి గురై గురువారం రాత్రి గ్రామ సమీపంలోని కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడరు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


సంజీవ్‌కుమార్ (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని గీతానగర్‌కు చెందిన సంజీవ్‌కుమార్(30) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. సంజీవ్‌కుమార్ వెండివర్తక దుకాణం నిర్వహిస్తుండగా, కొద్దిరోజులుగా ఖాళీగా ఉంటున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గీతానగర్‌లో అద్దెకుంటుండగా, శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో గడియ పెట్టుకుని ఎంతకూ బయటికి రాలేదు. అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- రాష్ట్రీయ శైషిక్ మహాసంఘ్ ప్రభారి వెంకట్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని రాష్ట్రీయ శైషిక్ మహాసంఘ్ ప్రైమరి, సెకండరి వింగ్ ప్రభారి పాలేటి వెంకట్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌ఎస్ఎస్ భవనంలో ఏబీఆర్ఎస్‌ఎం అనుబంధ సంఘమైన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఏబీఆర్ఎస్‌ఎం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా కొత్త సమస్యలను తీసుకొస్తుందని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు కోసం తమ సంఘం కేంద్ర ప్రభుత్వానికి విన్నవించగా ఫోర్‌మెన్ కమిటీ వేసిందన్నారు. సీపీఎస్‌పై పునర్ సమీక్ష కోసం ఈ కమిటీ కేంద్రానికి నివేదిక అందజేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, విద్య శాఖ మంత్రి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలభోజు గోపాలకృష్ణ, గౌరవ అధ్యక్షుడు అంబాజి, కుమ్ర యాదవ్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి


తుంగెన నర్సింగ్‌రావు (ఫైల్)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

లోకేశ్వరం: రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతిచెందిన సంఘటన మండలంలోని గడ్‌చాంద గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... తుంగెన నర్సింగ్‌రావు(51) ఇరువై ఏళ్లుగా లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బందోబస్తు విధులకు హాజరై బైక్‌పై తిరిగి వస్తున్న క్రమంలో మొహాళ గ్రామ సమీపంలో బైక్‌కు అడవి పంది తగిలి పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కాగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. నర్సింగ్‌రావు భార్య సంగీత 2005లో మరణించింది. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ప్రియంక, ప్రణవి ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబాన్ని ఆదుకుంటాం

హోంగార్డు నర్సింగ్‌రావు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గడ్‌చాంద గ్రామంలోని నర్సింగ్‌రావు పార్థివదేహానికి పుష్పగుచ్ఛం అందించారు. నర్సింగ్‌రావు కుటుంబ సభ్యులను పమార్శించి ఓదార్చారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయంను అందజేశారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ముథోల్ సీఐ వినోద్, లోకేశ్వరం ఎస్సై సాయికుమార్, హోంగార్డు ఆర్ఐ రామకృష్ణ, పోలీస్‌అసోసియేషన్ అధ్యక్షుడు విరాసత్ అలీ, దేవ్‌రావు ఉన్నారు. – ఎస్పీ ప్రవీణ్‌కుమార్, నిర్మల్

అటవీశాఖ దాడుల్లో రూ.30వేల కలప స్వాధీనం


కలప స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

ఇచ్చోడ: జిల్లా అటవీశాఖ అధికారుల ఆదేశాల మేరకు నేరడిగొండ మండలంలోని నాగమాల్యాల్, కుంటాల గ్రామాల్లో శుక్రవారం ఉదయం 6గంటలకు ఆకస్మికంగా దాడులు నిర్వహించి రూ.30వేల కలపను స్వాధీనం చేసుకున్నట్లు టైగర్ జోన్ ఎఫ్ఆర్వో వాహబ్‌అహ్మద్ తెలిపారు. సాయంత్రం ఆయన టైగర్‌జోన్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. జిల్లా అటవీశాఖ అధికారులు ఆదేశాల మేరకు ఇచ్చోడ టైగర్‌జోన్, నేరడిగొండ, తాంద్ర రేంజ్ పరిధిలో సిబ్బందితో కలిసి కలప స్మగ్లింగ్‌ను అరికట్టడానికి క్లస్టర్‌గా టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ క్లస్టర్ ఆధ్వర్యంలో రెండు గ్రామాల్లో దాడులు నిర్వహించి అక్రమంగా దాచి ఉన్న కలపను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో మూడు రేంజ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రాదేవికి చైత్రమాసం పూజలు


ఇంద్రాదేవి ఆలయంలో మొక్కుతున్న ఆదివాసీలు


నైవేద్యాలు తయారు చేస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యాదైవం మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో చైత్రమాసం పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. చైత్రమాసాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ఆదివాసీ గిరిజనులు తరలివచ్చి ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి మండలంలోని పిప్రి, గౌరపూర్, హీరాపూర్ గ్రామాలతో పాటు ఉట్నూర్, నార్నూర్, జైనూర్, గుడిహత్నూర్, సిరికొండ మండలాల నుంచి పలు గ్రామాల ఆదివాసీలు కుటుంబ సమేతంగా వచ్చి ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. చైత్రమాసం ముగింపు వరకూ ఆలయంలో పూజలు కొనసాగుతాయని ఆలయ మహారాజ్ చహకటి సూర్యరావ్ తెలిపారు.